

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

**19** వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా

కోనసీమ జిల్లా

తూర్పు గోదావరి జిల్లా

పోలవరం(రంపచోడవరం)జిల్లా

బుధవారం,28 జనవరి 2026

8 పేజీలు


# వైద్యో నారాయణో హరి:


## మరి ఈ ధరల సంగతేంటి ?



దోపిడీదారులు ముగ్గురు...బలైంది రోగి ఒక్కడు

- మందుల మాటున మానవత్వం మంటగలిసి.. భారమవుతున్న రోగి ప్రాణం!
- బ్రాండ్ పేరుతో 80 శాతం దోపిడీ..
- నిమ్మకు నీరెత్తినట్లు ఔషధ నియంత్రణ విభాగం
- అదే మందు.. అదే గుణం.. కానీ ధరల్లో అగాధమంత వ్యత్యాసం!




ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

**డాక్టర్ రాసిన బ్రాండెడ్ చిక్కులు:** సంజీవని న్యూరో క్లినిక్ డాక్టర్ పి.హరిప్రసాద్ రాసినచిట్టీలో కేవలం ఖరీదైన కంపెనీ పేర్లే దర్శనం..సామాన్యుడిపై మోయలేని భారానికి సజీవ సాక్ష్యం.

**బ్రాండ్ పేరుతో నిలువు దోపిడీ:**

ఒకే మందు.. ఒకే గుణం.. కానీ డబ్బా మీద పేరు మారితే ధర వంద రెట్లు! సామాన్యుడి ప్రాణవాయువు లాంటి మందుల మీద కార్పొరేట్ కంపెనీల కాసుల వేట.

**వంద రూపాయల మందు.. వేల రూపాయల బిల్లు:**

తయారీ ఖర్చు అణా పైసల్లో ఉంటే, అమ్మకం ధర మాత్రం ఆకాశంలో!

నెలకు రూ.3,000 మందుల బిల్లులో రూ.2,000 కేవలం కంపెనీల లాభాలే.

**నిబంధనలన్నీ 'చీటీ'లకే పరిమితం:** డాక్టర్లు జనరిక్ పేర్లే రాయాలని చట్టం చెబుతున్నా, కమీషన్ల కక్కుర్తితో బ్రాండెడ్ మందులనే కట్టబెడుతున్న వైనం.

**ఔషధ తనిఖీ అధికారుల మౌనం.. సామాన్యుడికి శాపం:**

మందుల షాపుల్లో ధరల నియంత్రణను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏసీ గదులకే పరిమితం. తనిఖీలు లేవు.. చర్యలు లేవు!

రోగం వచ్చిన వాడికి మందులు ప్రాణదాతలు కావాలి.. కానీ నేడు అవే మందులు సామాన్యుడి పాలిట శాపాలుగా మారుతున్నాయి. "బ్రాండ్" అనే చిన్న పదంతో ఔషధ మాఫియా ఏ స్థాయిలో దోపిడీ చేస్తోందో సూర్య ఇన్వెస్టిగేటివ్ బ్యూరో చేసిన క్షేత్రస్థాయి పరిశీలనలో నమ్మలేని నిజాలు బయటపడ్డాయి. తాజాగా కాకినాడ సంజీవని న్యూరో క్లినిక్‌కు చెందిన డాక్టర్ పి.హరిప్రసాద్ రాసిన మందుల చీటీని పరిశీలిస్తే, మందుల ధరల వెనుక ఉన్న భారీ కుట్ర వెలుగు చూసింది.

- మిగతా 2 లో..




మందు ధరలకి నా గుండె ఆగిపోయేలా వుంది...రోగి బాధ

# క్యాంటం కంప్యూటింగ్‌తో భవిష్యత్‌కు దారి

**- కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** భవిష్యత్తులో క్యాంటం కంప్యూటింగ్ విప్లవాత్మక మార్పులకు దారితీస్తుందని కాకినాడ సిటీఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. అత్యంత క్లిష్టమైన సమస్యలను ఊహకు అందనంత వేగంగా పరిష్కరించే సామర్థ్యం క్యాంటం కంప్యూటర్లకు ఉందని ఆయనఅన్నారు. మంగళవారం కాకినాడలోని ఏఎస్‌డీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల (ఉమెన్స్)లో, ఫిజిక్స్ మరియు కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంటం కంప్యూటింగ్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

- తరువాయి 2లో..

# అన్నవరంలో భీష్మ ఏకాదశి ఏర్పాట్లు పూర్తి

**- భక్తులకు అసౌకర్యం కలగకూడదు : ఈవో వేంద్ర త్రినాధరావు, చైర్మన్ ఐ.వి. రోహిత్**







**అన్నవరం,మేజర్‌న్యూస్ :** రత్నగిరిపై ఈ నెల 29న జరగనున్న భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై దేవస్థానం ఈవో వేంద్ర త్రినాధరావు, చైర్మన్ ఐ.వి.రోహిత్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో, డి.ఎస్పి, జిల్లా వైద్యాధికారి తదితర ముఖ్య అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

**కీలక నిర్ణయాలు:దర్శన వసతులు:** క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు తాగునీరు,చిన్నారులకుపాలునిరంతరంపంపిణీ చేయాలని ఆదేశించారు.

**-ప్రసాద వితరణ:** రామాలయం ఎదురుగా ఉన్న సర్క్యులర్ మండపం వద్ద భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేయనున్నారు. ప్రసాదం కౌంటర్ల వద్ద రద్దీ లేకుండా తగినన్ని నిల్వలు సిద్ధం చేశారు.

**- భద్రత - పారిశుధ్యం:** ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీస్‌శాఖ పర్యవేక్షణ ఉంటుంది. కొండపై పారిశుధ్యం కోసం ప్రత్యేక సిబ్బందిని కేటాయించారు.

**- విశిష్టత:** భీష్మ పితామహుడు విష్ణు సహస్రనామ

- తరువాయి 2లో..

# పెన్షనర్ల సమస్యలు సత్వర పరిష్కారం

– డిటివో సత్యనారాయణ



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** పెన్షనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం సంఘ అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా తూర్పు గోదావరి జిల్లా ఖజానా అధికారి (డిటివో)ఎన్. సత్యనారాయణ విచ్చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు పెన్షనర్ల సమస్యలకు సత్వర పరిష్కారం చేస్తున్నామని ఎవరికైనా మా కార్యాలయంలో ఎటువంటి ఇబ్బందులున్నా స్వయంగా కలవవచ్చని, మన జిల్లాలో తొమ్మిది వేల మంది పెన్షనర్లు ఉన్నారని వారిలో సుమారు ఆరువేల మందికి ఇటీవల ప్రభుత్వం డీ ఆర్ తమ ఖాతాల్లో జమయ్యాయని, మిగిలిన వారికీ ఈ నెలాఖరులోగా జమ కాగలవని చెప్పారు. మరో ముఖ్యఅతిథి సర్కిల్ ఇనస్పెక్టర్ ఆఫ్ పోలీస్(సి. ఐ) టి. గణేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని, మీవంటి విశ్రాంత ఉద్యోగులు మీ సమీపంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా మా దృష్టికి తీసువచ్చి సహకరిస్తే మరిన్ని మంచి సేవలు అందించగలమని మైత్రీ పోలీస్ వ్యవస్థలో మీరు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ మధ్యకాలంలో సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, పెన్షనర్స్ అందరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎవ్వరికీ ఓటీపీ గానీ, బ్యాంక్ లావాదేవీలు విషయాలుకానీ చెప్పవద్దని సూచించారు. అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు మాట్లాడుతూ ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ స్థాపించి ముప్పైఆరేళ్ళు అయ్యిందని ప్రతీ వ్యవస్థాపక దినోత్సవం రోజున సమాజానికి విశిష్ట సేవలు అందించిన అధికారులను, మా సంఘ సీనియర్ సభ్యులు ఇరువురిని సత్కరించుకోవడం చేస్తున్నామని డీ. టీ. వో సత్యనారాయణ, సీ.ఐ. స్థాయి అధికారులను మొట్టమొదటి సారిగా మీ సేవలను గుర్తించే సత్కరించుకునేందుకు నిర్ణయించామని తెలిపారు. ఏపిఎస్‌జిఆర్ ఈఏ జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు గత ప్రభుత్వం ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు రెగ్యులర్ గా ఇవ్వవలసిన డీఏ, డీఆర్ లు చెల్లించక పిన్షన్లు సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ధవళేశ్వరం యూనిట్ ప్రధాన కార్యదర్శి దువ్వూరి కామేశ్వరశర్మ, కోశాధికారి ఉర్రింకల సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ దాసరి సాయిబాబా, ఆలిండియా నాల్గవ తరగతి ఉద్యోగుల ఉపాధ్యక్షులు వెంపరాల వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ ఐ. వి. సుబ్బారావు, నల్లి విజయమోహన్, బందారు లక్ష్మి సంఘం చేస్తున్న సేవలను వివరించారు, అనంతరం డి. టి. వో సత్యనారాయణ, సీ. ఐ గణేష్, సీనియర్ సభ్యులు ఒగ్గు వెంకట రామారావు, కొంజెర్ల వెంకటరత్నం లను దుశ్శాలువాలు, పూమాలలు, మెమెంటో, వేదాశీర్వచనములతో ఘనంగా సత్కరించారు, ఆహ్వాన కమిటి సభ్యులు సమర్తకుర్తి రాంబాబు, పినిశెట్టి సత్యనారాయణ, జి. బాల శేషగిరిరావు లను డిటివో సత్యనారాయణ కండువాలు వేసి అభినందించారు. బందారు రవీంద్ర అందరికి తేనేటివిందు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో అంసూరి సూర్యారావు, ఎస్. సుబ్బారావు, కొండా సూర్యనారాయణ, బుగ్గా సుబ్రహ్మణ్యం, అరవ సత్యనారాయణ, కానూరి సత్యనారాయణ, రామక్రిష్ణ చౌదరి, సూర్యనారాయణ రాజు, దానియేలు, మహాలక్ష్మి రావు, సత్యారావు, పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీతలకు సన్మానం

– ఇరిగేషన్ అధికారులను సన్మానించిన డెల్టా చైర్మన్ మురాలశెట్టి



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగుల అవార్డును పొందిన నీటిపారుదల శాఖ పిఠాపురం సబ్ డివిజన్ డీఈ సంతోష్ కుమార్, ఏఈ భవాని లను స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వహించిన అధికారులకు అవార్డ్ రావడం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీలు కృష్ణ చైతన్య, ఎనుముల గోపాల కృష్ణ, కొప్పిరెడ్డి వీరాస్వామి, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, నీటి సంఘాల అధ్యక్షులు ఎన్.సత్యనారాయణ రాజు, బి.సత్తిబాబు, టి.త్రిమూర్తులు, ఎస్ శ్రీనివాస్‌రావు, డి.కొండలరావు, ఎన్.అమ్మి రాజు, టి.ప్రసాద్, ఎం.సత్తిబాబు, జనసేన పార్టీ నాయకులు కిషోర్, నాగేంద్ర, ఇరిగేషన్ సిబ్బంది, లస్కర్‌లు పాల్గొన్నారు

# వైద్యో నారాయణో హరిః.. మరి ఈ ధరల సంఎగతేంటి?

మొదటిపేజీ తరువాయి

బ్రాండ్ల వెనుక దాగి ఉన్న అసలు సూత్రం రోగి చేతికి ఇచ్చే చీటీలో పెద్ద అక్షరాలతో కనిపించేవి కంపెనీ పేర్లు మాత్రమే. కానీ వాటిలో ఉండే అసలు మందు రసాయన ఫార్ములా వేరే ఉంటుంది. సదరు చీటీలోని జెనాడోమ్ 500, టాల్–ఎస్, ప్రోలోల్ టిఆర్, రాపిజోలామ్ వంటి మందుల వెనుక ఉన్న నప్రోక్సెన్, ఎస్కిటాలోప్రామ్, ప్రోప్రానోలాల్ వంటి రసాయన నామాలు తెలిస్తే సామాన్యుడు తక్కువ ధరకే మందులు కొనుక్కోగలడు. కానీ, ఆ అవకాశం లేకుండా కేవలం బ్రాండ్ పేర్లనే ప్రమోట్ చేయడం వెనుక భారీ కమీషన్ల దందా దాగి ఉంది.

**వైద్యులు ఏం చేయాలి?**

వైద్య వృత్తి పవిత్రమైనది. సామాన్య రోగి ఆర్థిక స్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్యులు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకుంటే రోగికి ఎంతో మేలు జరుగుతుంది...

**– రసాయన నామాలే రాయాలి**

వైద్యులు కంపెనీ పేర్లు రాయడం సరికాదు... ఉదాహరణకు: టాల్–ఎస్ రాయకుండా, ఆ మందు యొక్క రసాయన నామాన్ని ఎస్కిటాలోప్రామ్ స్పష్టంగా రాయాలి. ఇది ఇలా జరిగేలాగా రసాయన పేర్లతోనే మందులు చీటీలు రాసేలాగా ఔషధ అధికారులు చర్యలు చేపట్టాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.

**– అవగాహన కల్పించాలి :** తక్కువ ధరలో లభించే జనరిక్ మందుల గురించి రోగులకు వివరించాలి.

**– ఖరీదైన స్రేలు వద్దు:** సామాన్యుడికి అందుబాటులో ఉండేలా టాబ్లెట్లు లేదా సిరప్‌లను మాత్రమే ప్రిస్క్రిప్షన్‌లో చేర్చాలి.

**ధరల ఆగాధం: సామాన్యుడి జేబుకు చిల్లు!**

బయట కార్పొరేట్ మెడికల్ షాపుల్లో ఒక వ్యక్తి నెలకు రూ.3,000 ఖర్చు పెట్టి కొనే మందులు, అదే నాణ్యతతో ప్రభుత్వ జన ఔషధి కేంద్రాల్లో కేవలం రూ.600 నుండి రూ.800లకే లభిస్తున్నాయి. ఉదాహరణకు, మార్కెట్లో రూ.28 అమ్ముతున్న ఒక బి.పి. టాబ్లెట్, జనరిక్ రూపంలో కేవలం రూ.4 కే లభిస్తోంది. ముఖ్యంగా నిద్ర కోసం వాడే రాపిజోలామ్ వంటి స్రేల ధరలు మార్కెట్లో వందల రూపాయల్లో ఉండగా, సాధారణ మాత్రలు పైసల్లోనే లభిస్తాయి.

**నిర్లక్ష్యం...సామాన్యుడికి శాపం**

జిల్లాలో మందుల ధరల నియంత్రణ, నాణ్యత తనిఖీలు చేయాల్సిన ఔషధ నియంత్రణ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. షాపుల్లో జనరిక్ మందుల లభ్యతపై ఆకస్మిక తనిఖీలు చేపట్టడంలో విఫలమవుతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, హరి ప్రసాద్ లాంటి గొప్ప డాక్టర్లు బ్రాండ్ నేమ్‌తో మందులు రాయకుండా చూడడంతోపాటు, ప్రతి మెడికల్ షాపులోనూ జనరిక్ మందులను అందుబాటులో ఉంచేలా వాటిని డిస్కౌంట్ ధరలతో అమ్మేలాగా చర్యలు తీసుకోవాలని రోగులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## క్వాంటం కంప్యూటింగ్‌తో భవిష్యత్‌కు దారి

మొదటిపేజీ తరువాయి

కాకినాడ నగరంలో ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో పరిశ్రమల స్థాపనకు తక్కువ ధరకు భూమికేటాయించి ఉపాధి అవకాశాలు పెంచేందుకుకృషి జరుగుతుం దని తెలిపారు. సాంప్రదాయ కంప్యూటింగ్‌కు భిన్నంగా, సరికొత్త సిద్ధాంతాలు మరియు లక్షణాలతో రూపొందిన ఆధునిక టెక్నాలజీనే క్వాంటం కంప్యూటింగ్ అనిఆయన వివరించారు.ఈపరిజ్ఞానం భవిష్యత్తు టెక్నాలజీలో కీలకపాత్ర పోషించనుందని అన్నారు.ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులకు రెండు రోజులపాటు క్వాంటం కంప్యూటింగ్‌పై శిక్షణకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.సువర్చల, ఫిజిక్స్ విభాగాధిపతి సూర్యనారాయణ దేవర, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరి, కంపెనీ ప్రతినిధి జాన్ యల్లతో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నవరంలో భీష్మ ఏకాదశి ఏర్పాట్లు పూర్తి

మొదటిపేజీ తరువాయి

ఉపదేశం చేసిన ఈ పర్వదినాన ఆలయంలో ప్రత్యేక పూజలు, పారాయణాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈవో త్రినాధరావు సూచించారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేసిన విప్ నాయకర్

**నరసాపురం రూరల్,మేజర్ న్యూస్:** మండలంలోని యర్రంశెట్టివారి పాలెంలో గ్రామంలో మంగళవారం ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఆయుష్ హాస్పిటల్ 22 లక్షల రూపాయలు,స్మశాన వాటిక 20 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా హాజరైనఎమ్మెల్యే నాయకర్, దేశం ఇంచార్జ్ పొత్తూరి రామరాజులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ యర్రం శెట్టి నాగ ముత్యమాంబ, బాబులు అతిథులకు సాలువాలు కప్పి సత్కరించారు. గ్రామస్తులు ఎమ్మెల్యే నాయకర్ కు పలు సమస్యలు చెప్పడం జరిగినది. అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. శంకుస్థాపన చేసిన పనులు వెంటనే ప్రారంభించాలని నాణ్యతతో కూడా పని చేయించాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఎర్రం శెట్టి బాబులు ఎంపీటీసీ ఆకన శ్రీదేవి చంద్రశేఖర వైస్ సర్పంచ్ తలగం శెట్టి శ్రీదేవి వాసు కోటిపల్లి వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులు జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జనవాణి ప్రతి దరఖాస్తు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా వినడమే జనసేన పార్టీ లక్ష్యం. జనవాణి వంటి కార్యక్రమాలు ప్రజలతో పాలనకు వారధిగా నిలుస్తాయి అన్నారు. ప్రతి అర్జీని బాధ్యతగా పరిశీలించి, న్యాయబద్ధమైన పరిష్కారం అందించేలా కృషి చేస్తాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బోడపాటి శివదత్ తిరుపతి అనూష, లీగల్ సెల్ ప్రతినిధి కొప్పెర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

**– అవులూరి సత్యనారాయణ**



**చింతూరు, మేజర్ న్యూస్** : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, అందుకోసం కుటుంబ సభ్యులందరూ తమ పిల్లలను విద్యాధికులను చేయాలని ప్రముఖ న్యాయవాది అవులూరి సత్యనారాయణ పేర్కొన్నారు. పోలవరం జిల్లా చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి గ్రామంలో చింతూరు డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ దళిత కుటుంబ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దళిత మహిళా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో భద్రాచలం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఆవులూరి సత్యనారాయణ ముఖ్య అధితిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలి అంటే ముందుగా విద్యను ప్రోత్సాహించాలని, ప్రతీ ఒక్క దళిత కుటుంబ సభ్యులు తమ పిల్లలను, తమ తమ కుటుంబ సభ్యులను విద్యను అభ్యసించేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా మహిళల పట్ల జరుగుచున్న అరాచకాలను అడ్డుకోవాలి అంటే మహిళ సంఘాలను ఏర్పాటు చేసుకొని ఆయా సంఘాల ద్వారా మహిళల సమస్యలను పరిష్కరించుకోవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా దళిత మహిళా సంఘం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. మహిళా సంఘం అధ్యక్షులుగా గొంది సుబ్బలక్ష్మి, సెక్రటరీగా మెల్లెం మరియమ్మ, కోశాధికారిగా బత్తుల నాగమణి, ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, గౌరవ సలహాదారులుగా అలివేలు, సంఘ సభ్యులుగా దోమల కోమలి, గంట్ల నాగేశ్వరి మరియు నారా ఇంద్ర లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో చింతూరు దళిత కుటుంబ సంక్షేమ సంఘం నాయకులు మెల్లెం నాగేంద్ర, కార్యదర్శి ఇంటి సుదర్శన్ కుమార్, కోశాధికారి నక్కా రజనీ కుమార్, లాడే శ్రీనివా సరావు, కట్టా వెంకటరమణ, ఉపాధ్యక్షులు గుబ్బల ఆనంద్, కుంట నుండి జయరాజు, గంగరాజు చింతూరు, వీఆర్ పురం, కూనవరం మరియు ఎటపాక మండలాల నుండి దాదాపుగా వంద మంది సభ్యులు సమావేశంలో పాల్గొనడం జరిగింది.

# వెదురు, అటవీ ఫలసాయాలు ద్వారా ఆదాయం

**రంపచోడవరం, మేజర్ న్యూస్** : అటవీ ప్రాంతంలో వెదురు, ఇతర ఫలసాయాలు ద్వారా ఒక కమిటీగా ఏర్పడి ఆదాయం చేసుకోవచ్చుని దాని ద్వారా గ్రామ అభివృద్ధి జరుగుతుందని ముసురుమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశీ కుంజం పేర్కొన్నారు. రంపచోడవరం మండలం తామరపల్లి పంచాయతీ గోపవరం బీర స్కూల్ లో సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ముసురుమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశీ కుంజం మాట్లాడుతూ గోపవరం, ఈతలపాడు గ్రామాలలో సుమారు 638 ఎకరాలలో ఉన్న అటవీ ప్రాంతంలో వెదురు ఇతర ఫలసాయాలు సేకరణకు ఒక కమిటీగా ఏర్పడి ఆదాయం చేసుకోవచ్చుని, తద్వారా గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కమిటీలను వెంటనే వేసుకోమని, గ్రామాలలో సమావేశం ఏర్పాటు చేసుకొని ఒక నిర్ణయానికి వస్తామని తెలిపారు. అంతేకాకుండా ప్రతీ దానిపై తమకు సాగు చేసుకొనే హక్కు కోసం ఉన్నతాధికారులకు తెలియపర్చాలని తెలిపారు.



ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ బాపన్నమ్మ, చిట్టిదొర, ఇంచార్జి పంచాయతీ కార్యదర్శి కామరాజు, పీసా ఉప అధ్యక్షులు చెల్లబ్బాయి, వేమన్న, పీసా కార్యదర్శులు బందం రవి, కొండయ్య, మాజీ సర్పంచ్ బాపిరాజు, మాజీ ఎంపీటీసీ తురసం వీరాయమ్మ, ఫారెస్ట్ గార్డ్ శుభద్ర, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్‌కు అవార్డు

**పాలకొల్లు, మేజర్ న్యూస్:** భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏపీ ప్రొహిబిషన్ , ఎక్సైజ్ ప్రధాన కార్యాలయం, మంగళగిరి వద్ద జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఎక్సైజ్ కమిషనర్,ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ,చామకూరి శ్రీధర్,కమిషనర్, ప్రొహిబిషన్ ,ఎక్సైజ్, పాలకొల్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్‌కు అవార్డు అందజేశారు,అడిషనల్ కమీషనర్ దేవ కుమార్‌కి,డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ ప్రభు కుమార్ కి, జిల్లా ఎక్సైజ్ అధికారి ప్రసాద్ రెడ్డి కి సీఐ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు,

# వైఎస్ఆర్సిపి మండల కమిటీలో గుండాల పంచాయతీ నుంచి ముగ్గిరికి చోటు







**– మండల సెక్రటరీగా ముక్కు కల్పన**

**– మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ముక్క శ్రీను, గుండి రాము ఎన్నిక**

**ఎటపాక, మేజర్ న్యూస్ :** వైవైఎస్ఆర్సిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చొరవతో ఎటపాక మండలం వైఎస్ఆర్ పార్టీ నూతన మండల కమిటీని ప్రకటించిన తరుణంలో ఎటపాక మండల ప్రెసిడెంట్‌గా ఆకుల వెంకట రామారావు నియమించగా, మండల కమిటీలో గుండాల పంచాయతీ నుండి మండలం సెక్రటరీ ముక్క కల్పన, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ముక్కా శ్రీను, గుండి రాము నియమింపపడ్డారు. ఈ సందర్భంగా సెక్రటరీగా ఎన్నికైన ముక్క కల్పన, ముక్క శ్రీను, గుండి రాము మాట్లాడుతూ మమ్మల్ని నమ్మకంతో నమ్మి మాకు ఇంత పెద్ద బాధ్యతను అప్పగించిన వైఎస్ఆర్‌సీపీ అధిష్టానానికి మరియు రంపచోడవరం ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి ఎల్లపుడు రుణపడి ఉంటామని, అలానే వారికి ప్రత్యేక కృతజ్ఞతలు అనీ, త్వరలో జరగబోయే సర్పంచ్ ఎన్నికలలో పార్టీ కోసం ఎలాంటి నిర్లక్ష్యతకు తావు లేకుండా పూర్తిగా పార్టీకి కోసం 100% కష్టపడతామన్నారు.

## గిరిజనులు భూమి సమస్యలు పరిష్కరించాలి

**– రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గిరిజనులు ఎక్కువగా భూమి సమస్యలతో బాధపడుతున్నారని, ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతి మండలంలోనూ భూమి సమస్య తీవ్రంగా ఉందని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి జిల్లాలకు సంబంధించిన మండలాల్లో ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి మంగళవారం విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో విధులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయవాడ కార్యాలయంలో ఐదు జిల్లాల నుండి వచ్చిన గిరిజనుల దరఖాస్తులను స్వీకరించినట్టు విలేకరులకు సమాచారం తెలిపారు. ఆయా జిల్లాలకు సంబంధించిన మండలాల ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా స్థానిక గిరిజనులకు న్యాయం జరగాలని సంబంధిత అధికారులకు స్పష్టంగా సూచించారు. ముఖ్యంగా గిరిజనులు ఎక్కువగా భూముల సమస్యతో బాధపడుతున్నారని, ప్రతి మండలంలోనూ భూమి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి జిల్లాలకు సంబంధించిన మండలాల ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి ఆదేశించారు.

# కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఘనంగా రక్తదాన శిబిరం

**– ప్రాణదాతలుగా నిలిచిన రామచంద్రపురం డిపో సిబ్బంది**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా కాకినాడ జిల్లా ఆర్టీసీ కాంప్లెక్స్ వేదికగా మంగళవారం భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, రోటరీ ఇంటర్నేషనల్ మరియు రెడ్ క్రాస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

ముగ్గురి ప్రాణాలు కాపాడే గొప్ప అవకాశం: ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ, రక్తదానం అనేది సాటి మనిషికి మనం ఇచ్చే అత్యున్నత కానుక అని కొనియాడారు. "మనం ఇచ్చే ఒక యూనిట్ రక్తంతో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చు. రక్తదానం పట్ల ఉన్న అపోహలు వీడాలి. పోషకాహారం తీసుకుంటే నెల రోజుల్లోనే రక్తం మళ్ళీ ప్యూరిపై అయ్యి శరీరంలో వృద్ధి చెందుతుంది" అని ఆయన పేర్కొన్నారు. తరలివచ్చిన రామచంద్రపురం డిపో సిబ్బంది: ఈ శిబిరంలో రామచంద్రపురం డిపోకు చెందిన సిబ్బంది సేవా దృక్పథంతో ముందుకొచ్చారు. గ్యారేజ్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, డ్రైవర్లు మరియు కండక్టర్లు కలిపి మొత్తం 27 మంది రక్తదానం చేశారు. వీరితో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు.

రక్తదాతలకు అభినందనలు: రక్తదానం చేసిన వారికి రోటరీ సంస్థ తరపున ప్రశంసా పత్రాలను అందజేసి వారిని గౌరవించారు. వివిధ విభాగాల నుండి తరలివచ్చి రక్తదానం చేసిన తన డిపో సిబ్బందిని రామచంద్రపురం డిపో మేనేజర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, రోటరీ మరియు రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐదు రోజుల బ్యాంకింగ్ అమలు చేయాలి

- కాకినాడలో బ్యాంకు ఉద్యోగుల భారీ గర్జన




**కాకినాడ, మేజర్ న్యూస్ :** బ్యాంకులకు వారానికి ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలని కుదిరిన ఒప్పందాన్ని తక్షణమే నోటిఫై చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కాకినాడ నగరంలో బ్యాంక్ ఉద్యోగులు భారీ నిరసన చేపట్టారు. మంగళవారం స్థానిక మెయిన్ రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్దకు నగరంలోని వివిధ బ్యాంకుల ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ మధ్య గత ఏడాది ఒప్పందం కుదిరినప్పటికీ, నేటికీ అమలుకు నోచుకోకపోవడంపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేసిన ఉద్యోగులు, అనంతరం అక్కడి నుండి సూపర్ బజార్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. సుమారు 600 మందికి పైగా ఉద్యోగులు ప్లకార్డులు చేతబూని అపోలో హాస్పిటల్, టౌన్ హాల్, శ్రీ కాంప్లెక్స్, ఎస్.ఆర్.ఎం.టి మీదుగా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు.ఈ సందర్భంగా యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ కన్వీనర్ ఆదినారాయణ మూర్తి మాట్లాడుతూ, ఏడాది క్రితమే ఐదు రోజుల బ్యాంకింగ్‌పై ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, అయితే ఇంతవరకు దానిని అమలు చేయకుండా జాప్యం చేయడం ఉద్యోగులను వంచించడమేనని మండిపడ్డారు. తక్షణమే ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జె.ఎన్.వి.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.సాంబశివరావు, రీజనల్ సెక్రటరీ పి. చంద్రశేఖర్, నాయకులు దుర్గాప్రసాద్, రంజీత్, శ్యామ్ పాల్గొన్నారు. అలాగే ఎస్.బి.ఐ ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ నాయకులు మధుసూదన్ తో పాటు వివిధ బ్యాంకుల ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేశారు.

# ఉత్తమ ప్రదర్శనగా అసత్యం నాటిక

- ముగిసిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు
- సందేశాత్మక నాటికలు అందించిన పరిషత్‌కు పలువురు అభినందనలు






**పెద్దాపురం, రూరల్ మేజర్‌న్యూస్ :** మూడు రోజుల పాటు పెద్దాపురం మండలం దివిలి-చంద్రమాంపల్లి గ్రామంలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల 7వ ఆహ్వాన పోటీలు మూడు రోజులు పాటు నిర్విఘ్నంగా కొనసాగాయి. ఈ నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి విశాఖపట్టణం వారి అసత్యం నాటిక నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ, తృతీయ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇది ఇతని సంతకం నిలిచాయి. జ్యూరి బహుమతిని గేమ్ నాటిక అందుకుంది. బహుమతులను రిటైర్డ్ చీఫ్ మేనేజర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ గోపి కాశివిశ్వనాథ్, విశ్వకవి విద్యా సంస్థల ఛైర్మన్ కంటిబోయిన నూకరాజు చేతుల మీదుగా అందజేశారు. ఉత్తమ దర్శకత్వం అసత్యం నాటిక దర్శకులు బాలాజీ నాయక్‌కు, ఉత్తమ రచన అమ్మ చెక్కిన బొమ్మ రచయిత జ్యోతిరాజ్ బీశెట్టికి అందజేశారు. ఉత్తమ నటుడిగా ఇది అతని సంతకం నాటికలోని కృష్ణమూర్తి పాత్రధారి రవీంద్రరెడ్డికి, ఉత్తమ నటిగా అమ్మ చెక్కిన బొమ్మ నాటికలోని అనసూయ పాత్రధారి జ్యోతిరాజ్ బీశెట్టి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షులు గొందేసి రాజా, గౌరవాధ్యక్షులు కొత్తెం స్వామినాధన్, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సతిబాబు, మానేపల్లి రవీంద్ర, కేదారి నాగేశ్వరరావు, గొందేసి సత్యానందం, వెన్నా సత్యనారాయణ (పండు), నూకలమంతి నానాజి, పోలాని సతిబాబు, కురుమెల్ల శ్రీనివాస్, కర్రి స్వామి, మాగాపు నాగేశ్వరరావు, కంటిబోయిన ప్రసాద్, జ్యోతుల దొరబాబు, సమ్మెట గంగాధర్ పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు డి.సత్యనారాయణ, మహపాతిన రాంబాబు, రామిశెట్టి సుబ్రహ్మణ్యం, బంగార్రాజు, నిహారిక, సూర్యకళ, అఖిల, హాసిని, ధరణి, నృత్యాలు ప్రదర్శించారు. పరిషత్ న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, జి.ఎస్.ఆర్.స్వామి, గంటా ముత్యాల నాయుడు వ్యవహరించారు.

# రిపబ్లిక్ పెరేడ్‌లో పాల్గొన్న కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి

- అభినందించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్.నాయుడు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ వింగ్ వాలంటీర్ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు 2026లో పాల్గొనట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్.నాయుడు తెలిపారు.

రాష్ట్ర రాజధాని అమరావతి పెరేడ్ గ్రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో బి. ఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.ధనుంజయ యూత్ రెడ్ క్రాస్ వింగ్ టీమ్‌లో పెరేడ్‌కు కంటెంజెంట్‌గా ఎంపికయ్యారు. వారం రోజుల శిక్షణ అనంతరం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంప్‌లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని విద్యార్థి హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు మాట్లాడుతూ ఆర్.డి క్యాంప్‌కు ఎంపిక కావటం చాలా అభినందనీయమని, యూత్ రెడ్ క్రాస్ వింగ్ కార్యక్రమాలలో ఇదొక ప్రతిష్టాత్మకమైనదని అన్నారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం యూత్ రెడ్ క్రాస్ వింగ్ కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు విద్య, సాంస్కృతిక అంశాలతో పాటు క్రీడలు, మార్చింగ్ వంటి అంశాలలో శిక్షణ ఇవ్వడం వలన ఈ విధమైన విజయాలు సాధ్యమవుతున్నాయని అన్నారు. రెడ్ క్రాస్ వాలంటీర్లను రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ఇండియన్ రెడ్ క్రాస్ ఛైర్మన్ వై.డి.రామారావుకు, కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంప్లో పాల్గొన్న ధనుంజయను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, యూత్ రెడ్ క్రాస్ వింగ్ నోడల్ ఆఫీసర్ టి.తేజేశ్వరరావు, డి.అశ్విని మరియు అధ్యాపకులు అభినందించారు.

## ఈ నెల 31న గరల్స్ హైస్కూల్ వార్షికోత్సవం

- ప్రధానోపాధ్యాయులు బి.జె.రవీంద్ర



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పిఎం శ్రీ డెన్నిస్ బచ్చు గవర్నమెంట్ గరల్స్ హైస్కూల్ (ఇఎస్‌టిడి 1959) 66వ వార్షికోత్సవం జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో నిర్వహించబడునని, పిఎం శ్రీ డెన్నిస్ బచ్చు గవర్నమెంట్ గరల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.జె.రవీంద్ర (గెజిటెడ్) తెలిపారు. 31వ తేదిన మధ్యాహ్నం 2 గంటల నుండి స్పోర్ట్స్, కల్చరల్ & యాన్యువల్ డే సెలబ్రేషన్స్ నిర్వహించబడునని, ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లితండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటి సభ్యులు, ఉపాధ్యా యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొనున్నారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టండి

- ఏవో చక్రధర్



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** సేంద్రియ వ్యవసాయాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారి చక్రధర్ తెలిపారు. మంగళవారం రాజవొమ్మంగి మండలంలో వోయ్యేడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పురుగు మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేసుకోవాలని తెలియచేసారు. అధిక మోతాదులో యూరియా వాడడం వలన పంటలకి పురుగులు, తెగుళ్ళు ఎక్కువుగా వ్యాప్తి చెందుతాయన్నారు. అలాగే నేల సారవంతం తగ్గుతుందన్నారు. ఎరువులు ఎక్కువుగా వాడడం వల్ల విషపూరిత ఉత్పత్తులు వస్తున్నాయని వాటిని వాడటం వల్ల ఆరోగ్యం పడవుతుందని తెలియచేసారు. అలాగే తదుపరి సీజన్ నుండి పంట నమోదు చెయ్యించుకున్న రైతులకు మాత్రమే యూరియా సరఫరా చెయ్యడం జరుగుతుందని తెలియచేసారు.

రైతులు అందరు తప్పకుండా సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌ని కలిసి ఏపీ అగ్రిస్టాక్‌లో పేరు నమోదు చేయించుకోవాలని, అగ్రిస్టాక్‌లో పేరు నమోదు అయిన రైతులకు మాత్రమే వచ్చేసారి నుండి పిఎం కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భవానీ, భరద్వాజ్, సాయి, పాల్గొన్నారు.

## ఎలక్ట్రీషియన్ డే ర్యాలీ



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా పోలవలం జిల్లా కేంద్రమైన రంపచోడవరంలో శ్రీ విజయ సాయిదుర్గా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్ అసోసియేషన్ సభ్యులు స్థానిక మెయిన్ రోడ్డులో అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.పోసిబాబు, వైస్ ప్రెసిడెంట్ యన్.ప్రసాద్, సెక్రటరీ సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా తామంతా ఐకమత్యంగా ఉంటామని, నిబద్ధతతో పనిచేస్తామని పేర్కొ న్నారు. గృహవినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాలానుగుణంగా మార్పు చెందుతున్న పరికరాలను ఉపయోగించి వినియోగదారులకు నాణ్యమైన వర్క్ అందిస్తామన్నారు. ఈ ర్యాలీలో అసోసియేషన్ ప్రెసెసిడెంట్ వై.పోసిబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎన్.ప్రసాద్, సెక్రటరీ సురేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# బాల హక్కులు పరిరక్షణ చట్టలపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం




**సామర్లకోట, మేజర్ న్యూస్ :** జిల్లా స్త్రీ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి ఆదేశాలు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం సామర్లకోట నందు బాలల హక్కులు పరిరక్షణ చట్టాలపై మరియు మిషన్ శక్తి పథకాలపై శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ ముఖ్యఅతిథిగా జిల్లా స్త్రీ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి విచ్చేసి మాట్లాడుతూ ప్రస్తుత సమస్యగా కాకినాడ జిల్లా నందు భిక్షాటన చేస్తున్న బాలల సంఖ్య ఎక్కువగా ఉన్నదని బాలల భిక్షాటన నిర్మూలన కొరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని శ్వేత కలెక్టర్ ఆదేశించి ఉన్నారని తెలిపారు. చేస్తున్న బాలలు రెండు రకాలుగా వున్నారు వారు మొదటిగా వారి సొంత పిల్లలతో భిక్షాటన చేయించడం లేదా చేయడం. రెండు బయటి పిల్లలను తీసుకువచ్చే వారిచే భిక్షాటన చేయడం లేదా చేయించడం. కొన్ని సందర్భాలలో పిల్లలను ఎత్తుకొని భిక్షాటన చేస్తున్న పిల్లలు ఏడవకుండా మత్తు పదార్థాలకు అలవాటు చేస్తున్నారు. ఇటువంటి పిల్లలను ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే లోకల్ పోలీసు వారి ద్వారా హాస్పిటల్‌కి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించగలరని తెలియజేశారు. ప్రతి గ్రామంలో కూడాను గ్రామ గ్రామస్థాయి బాలల పరిరక్షణ సంఘాలు ప్రతినెల మొదటి శుక్రవారం మూడో శుక్రవారం సమావేశాలు ఏర్పాటు చేసుకొని తమ గ్రామంలో బాలల సంబంధిత సమస్యలపై మరియు నిస్సహాయ స్థితిలో ఉన్న బాలల కొరకు చర్చించాలని అలాగే ఈ సంఘాల ద్వారా ప్రతి గ్రామంలో బాలల పంచాయతీ నిర్వహించేలా చూడాలని కలెక్టర్ ద్వారా ఆదేశాలు త్వరలో జారీ చేస్తామని తెలియజేశారు. బాలల పరిరక్షణ మరియు బాలల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి వ్యవహరిస్తూ చక్కటి ౹్రూ ద్వారా బాలల హక్కులు మరియు 18 సంవత్సరాల లోపు బాల బాలికలను లైంగిక దాడులు నుండి రక్షించేందుకు పోక్సో చట్టం 2000 గురించి శిక్షణ ఇస్తూ పోక్సో చట్టం అనేది లైంగిక నేరాల నుండి పిల్లలకు రక్షించడానికి భారత ప్రభుత్వం రూపొందించిన చట్టం అని తెలిపారు.

ఈ చట్టం 18 సంవత్సరాలు లోపు పిల్లలందరిని లైంగిక వేధింపులు, లైంగిక దాడి మరియు లైంగిక దోపిడీ నుండి రక్షిస్తుందన్నారు. బాలలపై లైంగిక వేధింపులు, లైంగిక దాడి, అశ్లీలత వంటి తీవ్రమైన నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఈ చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. లైంగిక నేరాలను బట్టి ఈ చట్టం కింద కఠిన శిక్షలు ఉంటాయన్నారు. తీవ్ర మైన లైంగిక దాడి కేసులో దోషికి కనీసం 10 సంవత్సరాలు నుండి 20 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు మరియు జీవిత ఖైదు వరకు శిక్ష విధించవచ్చునని విద్యార్థులకు తెలియజేసారు. అంతేకాకుండా విద్యార్థులు ఆకతాయిల మాటలకు, ప్రలోభాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా ప్రేమ పేరుతో వేధించిన, బహుమతులు ఇచ్చిన తీసుకోరాదని ముఖ్యంగా ఆడపిల్లలు భద్రత వారు చేతుల్లోనే ఉందని తమను తాము రక్షించుకోవలసిన బాధ్యత కూడా వారిపై ఉందని అన్నారు. ఈ చట్ట ప్రకారం నిందితుడికి కేసు తీవ్రతను బట్టి 20 సంవత్సరాల నుండి జీవిత ఖైదు పడే అవకాశం కూడా ఉందని తెలుపుతూ కేసులను రిపోర్ట్ చేసే విధానంపై శిక్షణ ఇవ్వడం జరిగింది.

తదుపరి జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి సిహెచ్ వెంకట్రావు బాల్య వివాహ నిషేధిత చట్టం 2006 పై శిక్షణ ఇస్తూ వారి వివాహ నిరోధిత అధికారులు గ్రామస్థాయి మండల స్థాయి డివిజనల్ సాయి మరియు జిల్లా స్థాయిలో ఉన్న అధికారులు ఎవరున్నారో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్ వెంకట్రావు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు ,పెద్దాపురం సిడిపిఓ జి ఉష, పిఠాపురం సిడిపిఓ దుర్గాదేవి, తుని సిడిపిఓ శ్రీలత, కాకినాడ అర్బన్ సిడిపిఓ జ్యోతి, కాకినాడ రూరల్ సిడిపిఓ వై. సిహెచ్ లక్ష్మి, ప్రతిపాడు సిడిపి ఓ పద్మావతి, జగ్గంపేట సిడిపిఓ పూర్ణిమ, శంకవరం సిడిపిఓ పి వెంకటలక్ష్మి,ఐ సి డి యస్ సూపర్ వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సిబ్బంది, వన్ స్టాఫ్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 29వ తేదీ నుండి భక్తాంజనేయస్వామి ఏకాహ మహోత్సవాలు

**– పటిక బెల్లం తులాభారం కొరకు భక్తుల ఎదురుచూపు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** నల్లాకులవారిపాలెం గ్రామంలో 16వ నెంబరు జాతీయ రహదారి ప్రక్కన వేంచేసియున్న శ్రీ భక్తాంజనేయ స్వామి వారి ఏకాహ మహోత్సవాలు జనవరి 29 వ తేదీ గురువారం నుండి ఫిబ్రవరి 2 వ తేదీ వరకు ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. 16 నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న నల్లకులవారిపాలెం గ్రామంలో భక్తాంజనేయ స్వామి వారి ఆలయం నిర్మించి 53 సంవత్సరాలు పూర్తికావడంతో ఈ ఏడాది అంగరంగ వైభవంగా స్వామివారి 53 వ వార్షికోత్సవ మహోత్సవాలను నిర్వహించడానికి గ్రామస్తులు ఉత్సవ కమిటీ సంయుక్తంగా ఏర్పాట్లు చేశారు. 29వ తేదీన స్వామి వారి ఉత్సవాలు ఐదు రోజుల పాటు నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు స్వామి వారికి జరుగుతాయని వేకువజాము నుండి స్వామివారి దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఐదు రోజులు స్వామివారి సన్నిధిలో భక్తులకు వినోద కాలక్షేపం కోసం భజనలు, కోలాట భజనలు, నాటికలు మ్యూజికల్ నైట్లు జరగనున్నాయన్నారు.

ఆలయ ప్రాంగణం అంతా రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలు చేశామన్నారు. 30 వ తేదీ ఉదయం లక్ష్మణ యతేంద్రుల ఆశీస్సులతో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 31వ తేదీ శనివారం స్వామివారికి లక్ష తమలపాకుల పూజ గంధ సింధూర పూజలు జరుగుతాయని వారు అన్నారు. ప్రతిరోజు ఏరికోరిన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఫిబ్రవరి 2వ తేదీన భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు భక్తులందరూ ఈ కార్యక్రమానికి తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. స్వామివారి సన్నిధిలో తులాభారానికి వీలుగా కాటా ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ తులాభారానికి భక్తులు ఎదురు చూడటం ఆనవాయితీ అని రద్దీ ఎక్కువగా ఉంటే రెండవ కాటా కూడా ఏర్పాటు చేస్తామని వారు అన్నారు. 29వ తేదీ రాత్రి మారుతి దీపావళి బాణసంచా వ్యాపారుల సహకారంతో కనులు మిరుమిట్లు గొలిపేలా బాణసంచా కాలుస్తారని అన్నారు. ఈ ఆలయం చిన్నదైనా స్వామివారు ఎంతో మహిమాన్వితులుగా పేరు ఉండటంతో ఎక్కడెక్కడినుండో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఈ ఉత్సవాలకు తరలివస్తుంటారు. సంతానం లేనివారు స్వామివారిని పూజిస్తే సంతానయోగం కలుగుతుందని కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తాంజనేయ స్వామి పేరు ఉంది. స్వామివారిని దర్శించుకోవడానికి ఉత్సవాలను పురస్కరించుకుని అధిక సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో మంచినీటి సౌకర్యం భక్తులకు కావలసిన ఏర్పాట్లను చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు మేజర్ న్యూస్‌కు తెలియజేశారు.

కూరగాయలు వర్తక సంఘం, భక్తాంజనేయ స్వామి ఉత్సవ కమిటీ సంయుక్త సహకారంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. స్వామి వారి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం చలువపందిర్లు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దూరప్రాంత భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉత్సవాలు జరిగే ఐదు రోజులు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ వారు తెలియజేశారు.

# కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైంది

**– జనసేన రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలి**
**– వైసీపీ కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్ఆర్సిపి కాకినాడ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత విమర్శించారు. ఈ మేరకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక మహిళా ఉద్యోగినిని బెదిరించి, మానసికంగా శారీరకంగా హింసించి, అబార్షన్ చేయించి, మూడేళ్ల కొడుకును సైతం చంపుతానని బెదిరించడం హేయమైన, దుర్మార్గమైన చర్య అన్నారు. మహిళల జోలికొస్తే తాటతీస్తామంటూ తరచూ చెప్పే ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఇలాంటి చర్యలకు పాల్పడిన తన పార్టీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హోంమంత్రి అనిత ఈ ఘటనపై స్పందించి అతనిపై చర్యలు తీసుకుని మహిళలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేయాలని కోరుతున్నామన్నారు. గత మా జగనన్న ప్రభుత్వంలో మహిళలకు రక్షణ ఉండేదని, నేటి కుటుంబంలో మహిళలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు.

# అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట బలుసుల పేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రేమజంట కు ఆదర్శ వివాహాన్ని నిర్వహించారు. సామర్లకోట బలుసుల పేటకు చెందిన ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన వడ్డి రమేష్, సామర్లకోట భీమవరం పేటకు చెందిన ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన శీలి నవదీపికలు ఒకరిని ఒకరు ఇష్టపడగా వారి వివాహానికి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో వారిరువురు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. వారు మేజర్లు కావడంతో స్థానిక సీఐఏ కృష్ణ భగవాన్ మండల తహసిల్దార్ కే.చంద్రశేఖర రెడ్డి వద్ద హాజరు పరిచారు. అనంతరం వారి ఇరువురి అంగీకారంతో వారు వివాహానికి అనుమతినిచ్చారు. కాగా వారికి బలుసుల పేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఇరువురికి వివాహాన్ని జరిపించారు. అనంతరం సీఐ కృష్ణ భగవాన్, కౌన్సిలర్ హరిబాబులు నూతన దంపతులను ఆశీర్వదించారు.


అలాగే తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి నూతన వధూవరులకు వివాహ కానుకగా రూ. 5వేలు నగదు అందజేశారు. కాగా వడ్డీ రమేష్ కుటుంబంతో నాయకులు మాట్లాడి అతని ఇంటికి దంపతులను పంపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేతల శ్రీనివాసరావు, వాడపల్లి నాని, తాతబాబు, పట్టా సత్తిబాబు, సికోటి కాటరాజు, గుడాల నగేష్, గుడాల నాగేశ్వరరావు, గుడాల శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అప్పారావు 'అక్రమ' రాకెట్

## కోట్లు కొల్లగొడుతూ.. కాన్సర్ విషం చిమ్ముతూ..!

- 50 రూపాయల ప్యాకెట్‌పై నయాపైసా ప్రభుత్వ పన్ను కట్టని దందా!
- ఖజానాకు కోట్లాది రూపాయల గండి!
- కేవలం పోలీస్ కేసులతో సరిపోదు..
- జీఎస్టీ, ఈడి అధికారులు రంగంలోకి దిగాలి
- బి.ఎన్.ఎస్.కఠిన సెక్షన్లతో ఉచ్చు బిగించాల్సిందే!






**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** తూరంగి కేంద్రంగా సాగు తున్న అక్రమగుట్కా, సిగరెట్ల రాకెట్ ప్రకంపనలు సృష్టిస్తోంది. విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రూ.1.5 కోట్ల సరుకు కేవలం ఆరంభం మాత్రమేనని, నిందితుడు అప్పారావు సాగిస్తున్న అక్రమ సామ్రాజ్యం ఇంకా లోతుగా ఉందని 'సూర్య' విచారణలో తేలింది. బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రాల నుండి ఆర్.ఆర్, విమల్, రజని గందా వంటి ప్రాణాంతక గుట్కాలను దిగుమతి చేస్తూ ఇతను సమాంతర వ్యవస్థను నడుపుతున్నాడు.

**పన్ను ఎగవేత: ప్రభుత్వానికి భారీ గండి!**

నిబంధనల ప్రకారం పొగాకు ఉత్పత్తులపై జి.ఎస్.టి మరియు సెస్ రూపంలో భారీగా పన్నులు ప్రభుత్వానికి చెల్లించాలి. కానీ అప్పారావు రాయ్‌పూర్, కర్ణాటకల నుండి ఎటువంటి బిల్లులు లేకుండా సరుకు తెస్తూ, ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా పన్ను కట్టకుండా కోట్లాది రూపాయల లాభాన్ని తన జేబులో వేసుకుంటున్నాడు.

ఈ బి.ఎన్.ఎస్ సెక్షన్లు నమోదు కావాల్సిందే.. ప్రజల డిమాండ్ ఇది కేవలం వ్యాపార తప్పు కాదు, వ్యవస్థీకృత నేరం. అందుకే అప్పారావుపై ఈ క్రింది సెక్షన్లతో విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..

బి.ఎన్.ఎస్111(ఆర్గనైజ్డ్‌క్రైమ్):అంతర్రాష్ట్ర స్మగ్లింగ్ నెట్‌వర్క్నడుపుతున్నందుకు. బి.ఎన్.ఎస్274(కల్తీ):ప్రాణాంతక రసాయనాలతో కూడిన గుట్కా అమ్ముతున్నందుకు. బి.ఎన్.ఎస్ 318 (చీటింగ్):పన్నుఎగ్గొట్టి ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నందుకు. బి.ఎన్.ఎస్ 105(హత్యా ప్రయత్నం): ప్రజల ప్రాణాలకు హాని కలుగుతుందని తెలిసికూడావిషపూరిత పదార్థాలు సరఫరా చేస్తున్నందుకు ఈ రకంగా కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ఆస్తుల రికవరీ జరగాలి!**

కేవలం ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేస్తే సరిపోదు. జి.ఎస్.టి, వాణిజ్య పన్నుల శాఖ మరియు ఈ.డి వంటి విభాగాలు రంగంలోకి దిగి,అప్పారావు ఎగ్గొట్టిన సొమ్మును అతని ఆస్తుల నుండి రికవరీ చేయాలి. ఈ 'ఆర్థిక ఉగ్రవాది'పై కఠినచర్యలు తీసుకోవాలని సంఘసంస్కర్తలు,మేధావులు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.

**అంతర్రాష్ట్ర మాఫియా సంబంధాలు..** ఛత్తీస్‌గఢ్, ఒరిస్సాతో పాటు కర్ణాటకలోని రాయచూర్, బీదర్ వంటి ప్రాంతాల నుండి బిల్లులు లేని నకిలీ గుట్కాను, ప్రభుత్వ గుర్తింపు లేని నాన్ బ్రాండెడ్ సిగరెట్లు రూ.కోట్ల సరుకునులారీల్లో కాకినాడకు తరలిస్తున్నాడు. సూర్యనారాయణ పురంలో ఉన్న సొంత ఇల్లు, జగన్నాధపురంలోని రహస్య గోదాములపై దాడులు చేసి, ఇతని కాల్ డేటాను విశ్లేషిస్తే మరిన్ని కోట్ల అక్రమ నిల్వల గుట్టు రట్టవుతుంది. ఇతనిదగ్గర పని చేస్తున్న ఆటో డ్రైవర్లు, సేల్స్‌మెన్స్‌ని పట్టుకుని మరిన్నివివరాలులాగే ప్రయత్నం చేయాలని ప్రజల కోరుతున్నారు.

ప్రజల డిమాండ్:పట్టుబడిన సరుకును వెంటనే ల్యాబ్ పరీక్షలకు పంపి, ఆ రిపోర్టుల ఆధారంగా అప్పారావుకు కఠినశిక్ష పడేలా చూడాలని, ప్రజారోగ్యాన్ని పాడుచేస్తున్న ఈ 'మాఫియా డాన్' ను కటకటాల్లోకి నెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

---

## ఈ నెల 29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** ఈ నెల 29వ తేదిన గురువారం ఉదయం 11 గంటలకు, మున్సిపల్ కౌన్సిల్ హాలు నందు కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించబడునని, కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొననున్నారని, కమీషనర్ తెలిపారు. కావున పురపాలక సంఘ వివిధ శాఖల విభాగాధిపతులు విధిగా హాజరు కావాలని, కమీషనర్ తెలిపారు.

---

# ఉత్తమ సేవలకు గుర్తింపు అవార్డుతో సత్కారం

- 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు



**పెరవలి,మేజర్‌న్యూస్ :** ముక్కామల గ్రామానికి చెందిన సలాది ఉదయభాస్కరరావు గత 16 సంవత్సరాలుగా పెరవలి మండలం లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు వివిధ సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు వశిష్ట వినియోగదారుల సంఘం కన్వీనర్ గా అనేక అవగాహన కార్యక్రమాలు చేసి ప్రజలను చైతన్యవంతులను చేశారు. ఆయన చేస్తున్న ఈ కార్యక్రమాల పట్ల ఆయన నిబద్ధతను సేవాభావాన్ని కృషిని గుర్తించిన పెరవలి తహసిల్దార్ కే నిరంజన్ సామాజిక కార్యకర్తగా సలాది ఉదయభాస్కరరావు యొక్క పనితీరు నివేదికను కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత దృష్టికి ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ మెఘా స్వరూప్ తీసుకుని వెళ్లడంతో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతిభావంతులకు అందించే అవార్డులలో సలాది ఉదయభాస్కరరావుకు కూడా స్థానం కల్పించారు.

దీంతో జనవరి 26వ తేదీ సోమవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో సలాది ఉదయభాస్కరరావుకు ఉత్తమ సామాజిక కార్యకర్తగా ప్రశంసా పత్రం అందించి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సలాది ఉదయభాస్కర మాట్లాడుతూ తనను సేవారంగంలోకి తీసుకువచ్చిన నామార్గదర్శి వంక రవీంద్రనాథ్‌కు సేవలలో తనను వెన్నంటి ప్రోత్సహించిన పెరవలి మండలం లయన్స్ క్లబ్ సభ్యులకు తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిన అధికారులు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు చేశారు. ఈ అవార్డు తనకు లభించడం పట్ల తనకు మరింత బాధ్యత పెరిగిందని పేర్కొంటూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మేఘా స్వరూప్, జగ్గంపేట శాసనసభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ నరసింహ కిషోర్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తదితర అధికారులు నాయకులు హాజరయ్యారు.

---

## డ్వాక్రా ఆర్థికలావాదేవీలపై ఈ-నారీలకు శిక్షణ



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** డ్వాక్రా పొదుపు సంఘాలలో ఆర్థిక లావాదేవీలు అవకతవకలు జరగకుండా ఈ-నారీ వ్యవస్థ ఉపయోగపడుతుందని ఏపీఎం ఎమ్.ధనరాజు అన్నారు. స్థానిక మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో సుమారు 72 మంది ఈ-నారీలకు డ్వాక్రాసంఘాల సంస్థాగత నిర్మాణం, మానవాభివృద్ధి, ఎస్.హెచ్.జి బ్యాంకు లింకేజి, జీవనోపాదుల పెంపుదల పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ శిక్షణ ప్రస్తుతం స్వయం సహాయక సంఘాలలో ఆర్థిక లావాదేవీలు భారీ స్థాయిలో జరుగుతున్న కారణంగా సంఘ లావాదేవీలలో పారదర్శకతసభ్యులలోనమ్మకం పెంపొందించుటకు ఈ-నారీ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి నెలా వారికి కేటాయించిన గ్రూపులు రెగ్యులర్‌గా మీటింగ్ పెట్టుకునేలా చూడటం, మీటింగ్‌లోనే సంఘ పొదుపులు, అప్పులు చెల్లింపులు జరిగేలా చూడటం, పుస్తకాలు వ్రాయడం మరియు ఆయా సంఘాల ఆర్థిక లావాదేవీలను మన డబ్బులు-మన లెక్కలు యాప్ ద్వారా ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని సూచించారు. దీని వల్ల ప్రతి సంఘం సభ్యురాలు తన లావాదేవీలు గానీ, సంఘం యొక్క లావాదేవీలు గానీ ఎప్పుడైనా ఎక్కడైనా యాప్ ద్వారా తెలుసుకోవచ్చని ఏపీఎం తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సి.సివిజయలక్ష్మి,ఇంచార్జి సీసీలు టి.చంద్రలీల, వరలక్ష్మి, అకౌంటెంట్ ఎ.కనకదుర్గ, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

## దాడికి గురైన బాధితుడు రామకృష్ణను పరామర్శించిన బిసివై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్



**శంఖవరం, మేజర్ న్యూస్ :** కత్తిపూడిలో గత నెలలో కొందరు ఉన్నత వర్గాలకు చెందిన వ్యక్తుల చేత దాడికి గురైనటువంటి ముత్తిన రామకృష్ణ అనేటువంటి బాధితుడిని మంగళవారం బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ పరామర్శించి అతను వైద్య ఖర్చులకోసం 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి బీసీలపై దాడులు తగవని, బీసీ రక్షణ చట్టం తెస్తామని ఇచ్చినటువంటి హామీపై ప్రభుత్వం నేటి వరకు సదరు చట్టం చేయకపోవడం వలన ఇటువంటి దాడులు జరుగుతున్నాయని, స్థానిక ప్రజాప్రతినిధులు అగ్రవర్ణాలకు చెందిన వారై ఉండడం వలన నిందితులకు కొమ్ముకాస్తున్నారని ఇటువంటి చర్యలు తగవని, పోలీసులు తక్షణమే 307 సెక్షన్ కట్టి నిందితులను శిక్షించాలని లేనిపక్షంలో, ఈ విషయమే తదుపరి బిసివైపార్టీ ఆందోళనను మరింత ఉధృతం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ లీడర్లు దేవర వెంకటరమణ, చీకల దుర్గా మణికంఠ ,ఈసరపు శ్రీను, కుక్క శీను, కొర్ని నాని, బర్ల రమణ, కిలపర్తి శ్రీను, చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో అగ్ని ప్రమాదం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట - కాకినాడ రోడ్‌లో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంబవించింది. ఆయిల్ ట్యాంకర్ అన్లోడింగ్ చేస్తుండగా మంటలు ఎగసిపడిన భయంతో సిబ్బంది పరుగులు తీశారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చినట్లు తెలిపారు.